ఎస్ఎస్ఆర్‌పై సమీక్ష



ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారులు రాంప్రసాద్, పాండురంగారెడ్డి

చాంద్రాయణగుట్ట: ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని ఎన్నికల ఓటర్ల జాబితా ప్రక్రియ ప్రత్యేక పర్యవేక్షణాధికారులు, డిప్యూటీ కలెక్టర్ రాంప్రసాద్, ఏఎస్‌వో పాండురంగారెడ్డి సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2025 కార్యక్రమంలో భాగంగా నర్కీపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో డీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ..ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. బీఎల్‌వోలు చేపడుతున్న ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియపై సంబంధిత సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం ప్రత్యేక అధికారులు సంతోష్‌నగర్, ఫలక్‌నుమాలోని పలు ప్రాంతాలలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, ఫలక్‌నుమాలో డీసీలు శైలజ, అరుణ కుమారీలు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నాయని వాటిని సాధ్యమైనంత తొందరలోనే మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బుల్కాపూర్ నాలా, టోలిచౌకీ నదీమ్ కాలనీలోని శాతం చెరువులను పరిశీలించారు. అనంతరం టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. టోలిచౌకీ డివిజన్‌తో పాటు నానల్‌నగర్ డివిజన్‌లో భారీ వర్షం కురిసిన ప్రతిసారి ప్రజలతో పాటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టోలిచౌకీ చౌరస్తాలోని వ్యాపారసముదాయాల్లో ఒకేసారి వరద నీరు చేరుతుందని దీన్ని వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎన్నోసార్లు బల్దియా కమిషనర్‌తో పాటు అధికారులను వరద నీటి నివారణ చర్యలు చేపట్టాలని కోరానన్నారు. అయితే అధికారులు మాత్రం వెంటనే స్పందించడం లేదని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫారాన్, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్రంలో ఎరుకల కులస్తులకు సముచిత స్థానం కల్పించడంతో పాటు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి సీతక్కను కోరారు. సోమవారం ఎరుకల సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ఎరుకల సోదరుల కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ.500 కోట్లు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కుల సోదరులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తమ కులస్తులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. కాగా ఈ వినతిపత్రంలోని విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి తగిన న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, సత్యనారాయణ, ఎల్లయ్య, రాజు, రమేష్, యాదగిరి, మల్లికార్జున్, డి.కృష్ణ తదితరులున్నారు.

భారతీయ సంస్కృతిలో | గురుశిష్యుల పరంపరకు ప్రత్యేక స్థానం


కళాకారులతో పాండురంగ ముతాలిక్, చిత్రంలో వసుంధర, వేమరాజు విజయ్‌కుమార్

నాంపల్లి: భారతీయ సంస్కృతిలో గురు శిష్యపరంపరకు ప్రత్యేక స్థానం ఉందని శ్రీ త్యాగరాజ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ ముతాలిక్ అన్నారు. సోమవారం రాత్రి నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 49వ జాతీయ స్థాయి నృత్య, సంగీత పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాండురంగ ముతాలిక్ హాజరై పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఉత్తమ కళాకారులుగా శిష్యులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర మాట్లాడుతూ.. లలిత కళలు మనసుకు ఆనందాన్ని, సంతోషాన్ని కలిగిస్తాయని అన్నారు. నృత్య గురువు నిష్టల సుధామాల అధ్యక్షతన జరిగిన సభలో నవ్య నాటక సమితి సంస్థ పక్షాన పాండురంగ ముతాలిక్‌ను, కథక్ నృత్య గురువులు సంజయ్ కుమార్ జోషి, రోహన్ దహల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు మధుమతి కులకర్ణి, సంధ్యారాణి, నవ్యనాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్‌కుమార్, కార్యదర్శి ఆర్.ఎస్.సుధారాణి పాల్గొన్నారు.

దర్గాలు, మదర్సాలు శాంతి కేంద్రాలు


మాట్లాడుతున్న మౌలానా కారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: ప్రవక్త మహ్మద్‌ని శాంతి మార్గం అని ఆయన ఎప్పుడు శాంతిని ప్రబోధించేవారని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. సోమవారం సమద్ ఉల్లా షా హజ్రత్ వార్షికోత్సవాల సందర్భంగా గోల్కొండలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దర్గాలు, మదర్సాలు శాంతి కేంద్రాలని అన్నారు. ప్రపంచంలో భారత దేశానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని గౌతమబుద్ధుడి కాలం ముందు నుంచి జాతిపిత గాంధీజీ వరకు శాంతి మార్గాన పయనించి విజయం సాధించిన వారే అని ఆయన గుర్తు చేశారు. ఇస్లాం మతంలో ప్రవక్త మహ్మద్‌తో పాటు మరేందరో ప్రవక్తలు కఠిన పరిస్థితుల్లో సైతం దైవ మార్గాన్ని అనుభవించిన వారే అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షా సమదుల్లా, దర్గా ఖాదీమ్ మహ్మద్ ఉస్మాన్, అబ్దుల్ జావిద్ ఖాన్, కారీ నూర్ మహ్మద్ షా ఖాద్రీ, అబ్దుల్ రజాక్ ఖాద్రీ, కారీ గులామ్ మహ్మద్ పాల్గొన్నారు.

28న గజల్ ఔర్ షాయరీ కీ షామ్

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ వారసత్వాన్ని కాపాడేందుకు, కళలను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈనెల 28న సాయంత్రం ఎంజే మార్కెట్ ప్రాంగణంలో గజల్ ఔర్ షాయరీ కీ షామ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఓ ప్రకటనలో తెలిపారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల వారు వెంటనే బుక్ మై షో ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

దుకాణాల కేటాయింపులో అవకతవకలపై విచారణ జరపాలి


ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: జీహెచ్ఎంసీ దుకాణాల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన దుకాణాల కేటాయింపుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..కామత్‌హోటల్ పక్కన ఉన్న జీహెచ్ఎంసీ దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్నారు. ఫిబ్రవరిలో జరిగిన జీహెచ్ఎంసీ షాపుల టెండర్ల ప్రక్రియలో అందులో ఉన్న వారికే తిరిగి దుకాణాలు కేటాయించారని ఆరోపించారు. తాను పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే గత టెండర్ల ప్రక్రియను రద్దుచేసి మరో కొత్త టెండర్ల ప్రక్రియ నిర్వహించనిచో తాను ప్రిన్సిపల్ సెక్రెటరికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందించి దుకాణాల కేటాయింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- ఇస్మామియాబజార్‌లో రూపుదిద్దుకుంటున్న అమ్మవారి భారీ విగ్రహం
- మట్టి, గడ్డి, వాటర్ కలర్స్‌తో తయారీ
- అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న వేడుకలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు గులాబ్ శ్రీనివాస్


మహాశక్తి దుర్గామాత నమూనా చిత్రం

సుల్తాన్‌బజార్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు ఇస్మామియాబజార్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మహాశక్తి దుర్గామాత విగ్రహం తయారవుతుంది. నిర్వాహకుడు గులాబ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 24 ఏళ్లుగా రాష్ట్రంలోనే అతిపెద్ద అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఎంతో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా....

నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈ సంవత్సరం చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో మహాశక్తి దుర్గామాత అవతారంలో 72 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ విగ్రహం గత కొన్ని రోజులుగా ప్రముఖ సిల్ప కళాకారుడు నగేష్ పర్యవేక్షణలో కోల్‌కతాకు చెందిన కళాకారులు అరవింద్ సారథ్యంలో 15 మంది కళాకారులు అమ్మవారిని తీర్చి దిద్దుతున్నారు. పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మట్టి, గడ్డి, వాటర్ కలర్స్‌తో ఏకో ఫ్రెండ్లీ విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద ఏకో ఫ్రెండ్లీ విగ్రహాన్ని భక్తులు దర్శించుకోనున్నారు. 72 అడుగుల అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం విక్టరి ప్లే గ్రౌండ్‌లో ఆవిష్కరించారు.

24 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్నాం..


24 ఏళ్లుగా అతిపెద్ద అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ నేపథ్యంలో మరింత వైభవంగా ఖైరతాబాద్ తరహాలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ ఉత్సవాలను కొనసాగిస్తున్నాం.
– గులాబ్ శ్రీనివాస్, నిర్వాహకుడు

టీఎన్జీఓ ఆధ్వర్యంలో అన్నదానం



అబిడ్స్: అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో సోమవారం మేదినవాబ్ జంగ్ కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. దాదాపు 600 మంది నిరుపేద రోగుల సహాకులకు అన్నదానం చేశారు. అనంతరం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సహాయకులకు ప్రతినెలా అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, శ్రీధర్‌నాయుడు, ముస్తఫా షరీఫ్, హబీబ్, చావూస్, ఆసుపత్రి సభ్యులు శివకుమార్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలి


మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహ్మద్ ఇంతియాజ్

నాంపల్లి: టీపీసీసీ నూతన కార్యవర్గంలో ముస్లిం మైనార్టీలకు సముచితమైన స్థానం కల్పించాలని టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ ఇంజియాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీలో పనిచేసే ముస్లిం మైనార్టీలను గుర్తించి సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో ముస్లిం మైనార్టీలకు సరైన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలి


ఎమ్మెల్యే వివేక్‌కి వినతిపత్రం అందజేసిన న్యాయవాదులు

సిటీ కోర్టులు: న్యాయవ్యవస్థలోని సమస్యలను పరిష్కరించి న్యాయవాదులకు అండగా నిలువాలని నాంపల్లి కోర్టు న్యాయవాదులు సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టి అండగా నిలువాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు, పీపీలు, ఏపీపీలు, స్టాండింగ్ కౌన్సిల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. జార్ఖండ్ ప్రభుత్వం నూతనంగా చట్టంలో తీసుకొచ్చిన విధంగా న్యాయవాదులకు ఆరోగ్యబీమా, పింఛన్, జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేల ఉపకార వేతనాలు ఇస్తున్నదని, తెలంగాణలోనూ అలాంటి చట్టం తీసుకుచ్చి న్యాయవాదులకు ఆదుకోవాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే వివేక్ వెంటకస్వామి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి, సీనియర్ హైకోర్టు న్యాయవాది పద్మారావు, నాంపల్లి కోర్టు న్యాయవాదులు రవీందర్, బీరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ సేవా పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ రాజలింగం కబడ్డీ స్టేడియంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తమ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని అంతే కాకుండా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు పాండుయాదవ్, ఆర్.మాణిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన



చార్మినార్: అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలను పొందుతూ బీజేపీ మరింత బలపడుతోందని బీజేపీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రామచంద్రరావు అన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ వర్గాలకు బీజేపీ అండగా నిలుస్తుండడంతో పార్టీ చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమానికి ముస్లిం వర్గాల నుంచి అనుహ్య స్పందన లభిస్తోందన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రి ఆధ్వర్యంలో సోమవారం చార్మినార్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పాతబస్తీ దారుషిఫాలో జరిగిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలువురికి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం జరుగుతున్న సభ్యత నమోదు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. మీర్ ఫిరాసత్ అలీ బాక్రి మాట్లాడుతూ..కేవలం హైదరాబాద్‌లోనే మైనార్టీ వర్గాల నుంచి లక్ష వరకు పార్టీ సభ్యత్వం నమోదు చేయించడానికి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో కె.గీతా మూర్తి, అల్కా మనోజ్, చందన జైన్, ప్రాచి జైన్, సర్దార్ జగ్జీత్ సింగ్, జగన్మోహన్ సింగ్, గురు చరణ్ సింగ్, ఎస్. ప్రవీణ్ కుమార్, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల చరిత్ర ఎంతో ఘనం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు

గన్‌ఫౌండ్రీ: కాకతీయుల చరిత్ర ఎంతో ఘనమైనదని శాసన మండలి సభ్యుడు గోరటి వెంకన్న అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ పూర్వి నృత్యాలయం ఆధ్వర్యంలో కృష్ణాది కొండయ్య రచించిన ఓరుగల్లు కాకతీయాంధ్ర చరిత్ర పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రచయిత కృష్ణాది కొండయ్య రచనలు ఎంతో మధురంగా ఉంటాయని కొనియాడారు. కాకతీయుల చరిత్రను నేటితరానికి తెలిసేలా పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. తండ్రి స్థాపించిన సంస్థను వారసత్వంగా కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు పేరిణి, ఇతర సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బుక్కా మహేష్‌బాబు, ఎండీ రాజ్ మహ్మద్, జ్వాలాముఖి, శ్రీనివాసాచార్యులు, డాక్టర్ పి.లక్ష్మణ్, కృష్ణాది శరత్‌బాబు, డాక్టర్ పి.లక్ష్మణ్, తొకల విజయశ్రీ, కరుణశ్రీ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

28 వరకు 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'



అబిడ్స్: మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర నీరు, వ్యర్థాల నిర్వహణపై ఏఐసీటీఈ ప్రాయోజిత అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. డబ్ల్యూడబ్ల్యూ ఐటీసీ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్ఎన్ ఉమాకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఎన్ ఉమాకాంత్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలలో వాతావరణ మార్పు ఒకటన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అండ్ గ్రాంట్స్ మేనేజర్ మిన్నుమ్‌రెడ్డి సాహితీ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. వేస్ట్ రీ సైక్లింగ్ అవగాహన పెంచుతూ కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని శ్రీకాంత్ వెల్లడించారు. ఎన్ఐటీ పాట్నా, ఐటీసీ, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ఈపీటీఆర్ఐ వివిధ పారిశ్రామిక నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు, డైరెక్టర్ ఎ ం.లక్ష్మీపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు, జి.బెనకాప్, డాక్టర్ జయశంకర్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బండితా నాయక్, డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, పలు రాష్ట్రాల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

జియాగూడ: ధూల్‌పేట్‌లోని బల్‌రామ్ గల్లీలో ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న మహిళలను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న సంధ్యాబాయిని అరెస్టు చేసి 1.863 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు జరపగా వచ్చిన రూ.62 వేల నగదు కూడా ఎస్టీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంధ్యాబాయికి గంజాయి సరఫరా చేసిన అభిషేక్ సింగ్, సంజనాబాయి, రాజ్‌నందిని, అతీష్ సింగ్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు.

డాక్టర్ కేవీ రమణమూర్తికి బెస్ట్ టీచర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ కేవీ రమణమూర్తి

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ కాలేజీ ఆఫ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణమూర్తికి బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. ఆదివారం రాత్రి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా ప్రిన్సిపాల్స్ అండ్ ఎడు లీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ వార్డును అందజేశారు. అవార్డు అందుకున్న రమణమూర్తి మాట్లాడుతూ..అవార్డులు మరింత బాధ్యతలను పెంచుతాయన్నారు. ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంలో తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రిన్సిపాల్ నౌషిన్ ఫాతీమా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏజీఎం రవీంద్ర బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తమ మనుమలు, మనవరాళ్లతో కలిసి ఈ సందర్భంగా అమ్మమ్మ, నానమ్మ, తాతలు ఉత్సాహంగా గడిపారు. పెద్దల పట్ల పిల్లలకు గౌరవం పెంచాలనే ఉదేశంతో ఈ గ్రాండ్ పేరెంట్స్ డేను నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ



నాంపల్లి: హైదరాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నంబరు–4లో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీసులతో పాటుగా ఎస్ఎంఆర్, సీసీఐ ఇతర సిబ్బంది హాజరై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైళ్లు, రైల్వేస్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీని చేపట్టారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా మొక్కలను నాటుతామని ప్రతిజ్ఞ చేశారు.

అన్ని రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించాలి


పురస్కారాల ప్రదానోత్సవంలో తెలంగాణ వారాల సంఘం ప్రతినిధులు

చార్మినార్: అన్ని రంగాల్లో వారాల కాపు సామాజిక వర్గానికి చెందిన వారు ఆశించిన ఫలితాలు సాధించాలని తెలంగాణ వారాల సంఘం చైర్మన్ కొరిగింజ శ్రీరాములు అన్నారు. పాతనగర్ శివారులోని మందయాదవరెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ వారాల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ వారాల సంఘం ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో ప్రతిభను కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నత విద్యాభ్యాసం పట్ల వారాల కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు అత్యంత ఆసక్తి కనబరచాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గాజుల చంద్రశేఖర్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు గాజుల కృష్ణతో పాటు లక్ష్మీనారాయణ, వకులాభరణం కృష్ణమోహన్, ముక్తా అంజయ్య, బైరిశెట్టి వెంకన్న, రమేష్, ముక్త కృష్ణ పాల్గొన్నారు.

25 నుంచి కబడ్డీ, ఖోఖో పోటీలు

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 25 నుంచి 27 వరకు 68వ పాఠశాల కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, బహదూర్‌పురా మండల్ సెక్రెటరీ మహ్మద్ రఫీక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్ఎస్ హుందాబజార్ చందాలాల్ బారాదరిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్–14–17 సంవత్సరాల బాలబాలికలకు కబడ్డీ, ఖోఖోలో పోటీలు ఉంటాయన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మూడు తరాల తెలుగు సాహితీకారుల కృషి అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సబ్బిని లక్ష్మీనారాయణ రచించిన సబ్బిని సాహిత్య వ్యాసములు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ..తెలుగు సాహిత్యంలోని రచనా వైభవం చిరస్మరణీయులను తెలిపే రచనలు వికసిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, సాహితీవేత్త సంకేపల్లి నాగేంద్రశర్మ, హెచ్‌సీయూ ఆచార్య డి.వెంకటేశ్వర్‌రావు, నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాస్, సంస్థ అధ్యక్షులు రాంచంద్రరావు, కార్యదర్శి రఘుశ్రీ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

గోల్కొండ: టోలిచౌకీ జమాలికుంటలో ఆదివారం జరిగిన హత్య ఉదంతం స్థానికంగా సంచలనంగా మారింది. తన సోదరిని వేధిస్తున్నాడే కారణంతో సొంత బావను కత్తితో దాడి చేసి చంపిన అమూద్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉండే హతుడు ఆలీమ్‌తో గొడవపడి భార్య బేగం వారం రోజుల క్రితం తన తల్లి నివాసం ఉండే జమాలికుంటకు వచ్చింది. అయితే ఆదివారం మధ్యాహ్నం అమూద్ తన బావ ఆలీమ్‌కు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. సుమారు 4గంటల పాటు వారి ఇంట్లోనే సుదీర్ఘ చర్చలు జరిగినట్లు తెలిసింది. వాదోపవాదాలు జరిగి అమూద్, ఆలీమ్ ఒకరినొకరు తిట్టుకున్నారు. కోపంతో ఆలీమ్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అయితే అమూద్ అక్కడ ఉన్న కత్తితో అలీమ్ వెంటపడి తలపై విచక్షణ రహితంగా దాడి చేసి చంపాడు. అయితే ఈ హత్య కేసులో నిందితుడు అమూద్‌తో పాటు అతడి సోదరుల ప్రమేయం కూడా ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది కలిసి ఆలీమ్‌ను చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.